
# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## జానకి

### (వెండి తెర సెప్టెంబర్ 1962 నుంచీ పునర్ముద్రణ)



**పన్నెండు సంవత్సరాలు!** అవును. దీర్ఘమైన పన్నెండు సంవత్సరాలు వెనుకపడిపోయాయి – కృషి. ఫలితం అనే పదాలకు విలువ ఉన్న రోజులవి. ప్రతి చిన్న విషయంలోనూ నిర్మాతా, దర్శకుడు, నటీనటులు యెక్కువ శ్రద్ధ, ఉత్సాహమూ చూపిన రోజులవి. కేవలం డబ్బు చేసుకునే యంత్రాలుగా కాకుండా వాస్తవికతకు సన్నిహితంగా, కళకు ప్రాధాన్యతనిచ్చి న్యాయంగా చిత్రాలు తీసిన మంచిరోజులవి. బాక్సాఫీస్ వేల్యూ, స్టార్ వేల్యూ అనే మాటలకు అర్థం తెలియని బంగారు రోజులవి. ఇప్పుడో! ఎక్కడ చూచినా యీ రెండు పదాలే ప్రతిధ్వనిస్తున్నాయ్. ఈ పదాలు యెక్కడినుంచి వచ్చాయ్? ప్రేక్షకులలోంచి వచ్చినవికావు. డిస్ట్రిబ్యూటర్ల డబ్బుతో చిత్రాలు తీసి చిత్రాలు మొదలు పెట్టకుండానే లాభాలను లెక్క వేసుకునే నిర్మాతలూ, ప్రవాహానికి యెదురీదే ధైర్యంలేని మనం సృష్టించుకున్న రక్ష.. అపోహ యీ రెండు పదాలు. "టైముకి" విలువలేదు. కృషికి గౌరవంలేదు. విలువ అంతకంటే లేదు తక్కువ కాలంలో యెక్కువ డబ్బు సంపాదించాలనే కాంక్షతో కథసంగతే ఆలోచించకుండా "బాక్సాఫీస్ చిత్రమంటే" యివన్నీ ఉండాలని నిర్ణయించుకుని, పెద్ద తారాగణం (సోకాల్డ్ స్టార్‌వేల్యూ ఉన్నవారు) జుగుప్స కలిగించే

కామిడి, కథకు సంబంధంలేని పాటలు – అర్థంలేని, అనవసరమైన పేతోస్‌తో చిత్రాన్ని పేక్ చేసి దేశం మీదకు వదిలేస్తే, ప్రజలను హిప్నటైజ్ చేసి నిర్మాతకు కనక వర్షం కురిపించే శక్తి వీరు తీసిన ప్రతి చిత్రానికి ఉందని అనుకుంటే యెలా?

కేవలం పెద్ద తారాగణం మీద ఆధారపడి తీసిన చిత్రాలు యెన్ని? అటువంటివి యెన్ని ఆర్థికంగా అపజయం పొందలేదు? కనీసం "కళాఖండము" అన్న బిరుదయినా సంపాదించుకోలేకపోయాయికదా! కథ, దర్శకత్వంలో బలంలేని చిత్రాలలో నటించే స్టార్‌వేల్యూ ఉన్న స్టార్స్ మాత్రం యేం చేస్తారు పాపం. చిత్రం అపజయం పొందితే నిరుత్సాహపడడం, ప్రజలలో వారు సంపాదించుకున్న ఆదరాభిమానాలు పోతున్నాయేమోనని భయపడ్డం తప్ప చిత్రవిజయానికి కేవలం "స్టార్ వేల్యూ" యెంతమాత్రం పని చెయ్యదు. కాకపోతే అన్నీ బాగున్న చిత్రంలో పెద్ద నటీనటులు పనిచేస్తే చిత్రానికి జీవం పెరుగవచ్చు. ఈస్టార్ సిస్టమ్ వల్ల చిత్రపరిశ్రమ మాటటుంచి నటీనటులకు విపరీతమైన హాని కలుగుతోంది. పొరపాటున యేదో, యెక్కడో ఒక చిత్రం ఆర్థికంగా అర్థంలేని విజయాన్ని సంపాదించినంత మాత్రాన ఆ చిత్రంలో నటించిన నటీనటులంతా హఠాత్తుగా స్టార్స్ అయి తెల్లారేసరికి వేల్యూ సంపాదించుకుని తామేమిటో, తమశక్తి యేమిటో తెలుసుకోక ముందే అందలమెక్కి కూర్చోవడం జరుగుతోంది. నిర్మాతలు నమ్మేదీ. మోజుపడేది యీ "స్టార్‌వేల్యూ"యే కాబట్టి యీ కుక్కగొడుగుల స్టార్స్‌కు ఊపిరి సలపకుండా బుకింగ్స్ మీద బుకింగ్స్ పాపం. వాళ్ళు మాత్రం యేం చేస్తారు? "నాకు తీరికలేదు. వచ్చే సంవత్సరం కాల్‌షీట్స్ యిస్తాను" అని అంటున్నా వినకుండా నిర్మాతలు విరగబడి బుక్ చేస్తూ ఉంటే! తాము నటిస్తేనేగాని ఆ నిర్మాతలకు గతిలేదని వారిమీద సానుభూతి చూపి, వచ్చిన చిత్రాలన్నీ ఒప్పుకుని, వ్యవధిలేక, కాల్‌షీట్స్ సర్దుబాటు చెయ్యలేక, పనిమీద ధ్యానం ఉంచలేక, ఆరోగ్యం కాపాడుకోలేక నానా అవస్థలు పడుతున్న తారల సంగతి యేమిటంటారు? వాళ్ళకు మనఃశ్శాంతి యెక్కడిదంటారు. వీళ్ళు సాధించగలిగిందేమిటంటారు?

ఆశయాలతో తగిన అవకాశాలతో కృషితో సాధించిన ఫలితాలకు గల విలువ, ఆనందం వీరికి దక్కదు, ఎప్పటికప్పుడు భయం – ఎప్పటికప్పుడు అనుమానం "రేపు మనకంటే తక్కువ టైములో స్టార్ వేల్యూ సంపాదించుకునే తారలు వస్తే మనం వెనుక పడతామేమో?"నన్న చింత. ఈ భయంతో వీరు సాధించేదంతా ఒక్కటే. "స్టేటస్" అంటే యేమిటనుకున్నారు. పదిహేడు సంవత్సరాలుగా కష్టపడి, కృషిచేసి, జీవితంలో ఒడుదుకుల్ని తట్టుకుంటూ మనస్సును బేలన్స్ చేసుకుంటూ కళకోసం వారి వ్యక్తిగత జీవితాన్ని కూడా కఠినమైన మార్గాలకు మళ్ళించి, ఇంతకాలం వారు పడ్డ శ్రమకు యెంతయినా సుఖాన్ని అనుభవించే అర్హత ఉందని నిరూపించిన తరువాత పెద్ద యిళ్ళు – పెద్దకార్లు సంపాదించుకున్న వారితో పోటీకి వెళ్ళడం.

"మీరు యిన్నేళ్ళు కష్టపడి సాధించింది యిది. మేము నిన్ననే వచ్చాం. కాని మా దగ్గిర ఉన్న కార్లు, యిళ్ళూ వస్తువులూ మీ దగ్గర ఉన్నాయా?" అంటారు. దీన్నిబట్టి డబ్బుతో స్టేటస్‌ను కొనుక్కోవచ్చుననేగా వాళ్ళనేది. ఇటువంటి

వారిని చూస్తే జాలి పడడం తప్ప మనం చేసేదేమీలేదు. అదే సమయంలో కొన్ని సంవత్సరాలుగా వారి జీవితాలను చిత్రపరిశ్రమకే అంకితం చేసి కష్టసుఖాలను సమంగా అనుభవించే నిగ్రహాన్ని సంపాదించి యీనాడు వారి కృషి ఫలితాన్ని అనుభవిస్తున్న నటీనటులను చూచి గర్వపడుతున్నాను. ఈ నటీనటులకు చిత్ర పరిశ్రమ యెంతయినా ఋణపడి ఉంది.

స్టార్ సిష్టం మీద చలామణి అవుతున్న యీ పరిశ్రమలో క్రొత్త నటీనటులకు యెటూ అవకాశాలు లేవు కనుక. (అప్పుడప్పుడు కొత్తవారు రావాలి, కావాలి అని మన నిర్మాతలు ఘోషపెడుతున్నారనుకోండి) కనీసం కొన్ని మార్పులు చెయ్యడం అవసరం. ఫలానా ఫలానా వారుంటేనేగాని తాము తీసిన చిత్రాలను ప్రజలు చూడరనుకోవడం మానెయ్యాలి. పాత్రలకోసం నటీనటులేగాని నటీనటులకోసం వేషాలు కావన్న విషయన్ని గుర్తుంచుకుంటే యిప్పుడు చూసే చిత్రాలకంటే మంచి చిత్రాలు చూడవచ్చు. స్టార్‌వేల్యూ మీద చూపే నమ్మకాన్ని ఆసక్తిని "మంచి కథకోసం" నటీనటులను సక్రమంగా ఊపయోగించుకునే దర్శకుల కోసం చూపితే తప్పకుండా విజయవంతమైన చిత్రాలను తియ్యవచ్చును. మంచి చిత్రాలను తయారుచేసేందుకు ప్రేక్షకులు కూడా సహాయపడాలి. "మీకు యెటువంటి చిత్రాలు కావాలి?" అనే ప్రశ్న చిత్రపరిశ్రమనించి అనేకసార్లు వెయ్యబడింది. హీరోహీరోయిన్లు డ్యూయట్ పాట పాడితే థియేటర్ నుంచి లేచి బయటకు వెళ్ళి సిగరెట్ వెలిగించో, "పురుషులు" అని సూచించే బోర్డు ఉన్నవైపో వెళ్ళిపోతారాయే – కష్టపడి నటీనటులు యేడుస్తూ నటిస్తే వారితోపాటు మీరూ ఏడవరు సరికదా, "ఛీ..ఛీ.. యిక్కడికొచ్చినా యిదేమి ఖర్మరా నాయనా అంటారాయె. కథలో కామెడీకి చోటులేక అంతగా అవసరం లేక నిర్మాతలు తెలివిగా కామెడీ లేకుండా చిత్రం తీస్తే "ఇదేం పిక్చర్ అయ్యా బొత్తిగా కామెడీలేదు" అంటారాయె. అందుకే మీ తృప్తికోసం అన్ని రసాలూ ఉన్న చిత్రాలను తయారుచేసి పంపుతున్నారు నిర్మాతలు. మీకు కావలసిన నటీనటులు మీకు కావలసిన అన్ని హంగులతో తయారై వచ్చిన చిత్రాలను కూడా మీరు ఆదరించకపోయేటప్పటికి నిర్మాతలు యేమీ అర్థంకాని స్థితిలో ఉన్నామంటున్నారు. మీకెలాంటి చిత్రాలయితే నచ్చుతాయో తెలియక వారిక్కడ పడే అవస్త ఏమని చెప్పను.

ఈ మధ్య నేనొక తెలుగు చిత్రం శతదినోత్సవం సందర్భంలో ఆంధ్రదేశం వెళ్ళాను. కామెడీ నటీనటులయందున్న అభిమానం, మోజు హీరోహీరోయిన్ల మీదకూడా లేదని గమనించాను. మీ కష్టాలను మీ యేడుపులను మరపించే కామెడి చిత్రాలయితే చూస్తారా? ఎంతకాలం చూస్తారు. వరుసగా నాలుగు చిత్రాలు కామెడి సరుకుతో వస్తే "ఏందయ్యా యిది కథాలేదు పాడు లేదు అంటారు" అందుకని యేదో కాస్త సర్దుకుని ఒక మోస్తరుగా ఉన్న చిత్రాలను కూడా చూడడం నేర్చుకోండి మరి మా నిర్మాతలకు కాస్త ధైర్యం వస్తుంది.

ఇక నా సంగతి ఈ పన్నెండు సంవత్సరాలుగా చిత్రపరిశ్రమలో పనిచేస్తూ ఉన్నా, సాధించింది సున్నా. నేను నటించిన చిత్రాలు చాలాకొద్ది ఆర్థికంగా విజయాన్ని పొందాయి. ఎప్పటికప్పుడు చిత్ర పరిశ్రమలో మార్పుల్ని గమనిస్తూ నిరుత్సాహపడకుండా నాకు లభించిన కొద్ది అవకాశాలను ఉపయోగించుకిన్నాననే చెప్పాలి. కానీ నాలో యేదో మార్పు.

అది ఫలానా అని చెప్పలేను. నేను చూచిన యీ పన్నెండు సంవత్సరాల కఠిన జీవితం నాలో యీ మార్పుకు కారణం అయి ఉండవచ్చు. ఎక్కువకాలం యేమీ సాధించలేకపోయానని మనసు పాడుచేసుకోవడం నాకిష్టంలేదు, త్వరలో నా జీవితంలో మార్పురావాలని కోరుకుంటున్నాను. నాకు పిల్లలంటే యిష్టం. వారి మధ్య ఉంటే నేనన్నీ మరచిపోతాను. వాళ్ళతోపాటు నేను పిల్లనైపోతాను. ఆ అమాయకత్వం అనురాగం కోసం యెదురుచూసే ఆ చిన్నారి కళ్ళూ నన్ను ముగ్ధురాల్ని చేస్తాయి. చిన్నప్పటినుంచి నేను పొందని, యివ్వలేని ప్రేమానురాగాలు పిల్లలపట్ల ఉపయోగపడగలవన్న నమ్మకం నాలో ఉంది. చాలారోజులుగా, తల్లితండ్రుల ప్రేమనెరుగని అనాథ శిశువులకు అండగా ఉండి వాళ్ళను పెంచాలన్న కోరిక నాలో ఉంది .అనాధ శరణాలయంలో పనిచేసే అవకాశం కల్పించుకుని నా కోరిక తీర్చుకోగలిగితే నేనదృష్టవంతురాలినే. అక్కడ కూడా ఒకప్పుడు నేను పనిచేసిన యీ చిత్ర పరిశ్రమను గురించి. నాకింత అనుభవాన్ని ప్రసాదించిన వివిధరకాల వ్యక్తుల్ని గురించి ఆలోచిస్తూ ఉంటాననుకుంటా బహుశా! నా తెర జీవితం ఒక అంతానికి వస్తూందన్న ఆలోచనే యీ సదుద్దేశాలకు అవకాశాన్ని కల్పిస్తున్నాయనుకుంటా.

Post your comments